క్లుప్తంగా

కొత్తపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్



కొత్తపాలెంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: మండలంలోని కొత్తపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ దినేష్ సుమారు 60 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల, హేమదుర్గాదేవి, వాణిదుర్గ, రామకృష్ణ, ప్రభాకర్, సతీష్, ఆశ వర్కర్లు స్వర్ణ, లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జగ్గమ్మ సత్రం ట్రస్టీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం స్థానిక మన్యం జగ్గమ్మ సత్రం ట్రస్ట్ సభ్యులు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నంబూరి గంగాపవన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అనేక సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. అంతే కాకుండా ప్రభుత్వంతో పాటు అనేక సేవా సంస్థలు, సత్రాలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని విద్యలో మరింత అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, ట్రస్ట్ సభ్యులు పోకల వెంకటేశ్వరరావు, కడలి రామలక్ష్మి పాల్గొన్నారు.

సమగ్రంగా ఓటర్ సర్వే



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్యామల

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో ఓటర్ సర్వే సమగ్రంగా జరపాలని కమిషనర్ ఎం.శ్యామల అన్నారు. స్థానిక భీమవరం మునిసిపల్ కార్యాలయంలో జరిపిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓటర్ సర్వే సమగ్రంగా జరపాలని, కొత్త ఓటు హక్కు అర్హత ఉన్న వారిని ఎన్‌రోల్ చేయడం, ఒకే డోర్ నెంబర్లు పై ఉన్న ఓట్లను వివరాలను తనిఖీ చేసిన రిపోర్ట్ తదితర విషయాలపై సూచనలు జారీ చేశారు. ఈ విషయంలో ఎలాంటి తప్పిదం జరిగినా సంబంధిత సచివాలయ సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఏసీపీ పి.గౌరు, రెవిన్యూ ఆఫీసర్ రంగారావు పాల్గొన్నారు.

ఏఎస్‌ఎన్‌ఎం డిగ్రీ ఫలితాల విడుదల



సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ జూలై నెలలో జరిగిన రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు తెలిపారు. రెండో సెమిస్టర్‌లో 82 శాతం, నాలుగో సెమిస్టర్‌లో 68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.కృష్ణ, సీహెచ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ రైసింగ్‌కు 22 అవార్డులు



అవార్డులతో జేసీఐ రైసింగ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ జేసీఐ పాలకొల్లు రైసింగ్‌కు 22 జోన్ అవార్డులు వచ్చినట్లు శుక్రవారం పట్టణ జేసీఐ రైసింగ్ అధ్యక్షురాలు డాక్టర్ కావలి మౌని తెలిపారు. గురువారం ఒంగోలులో జరిగిన జేసీఐ జోన్ మిడ్ ఖాన్ కాన్ఫరెన్స్‌లో పట్టణ శాఖకు అవార్డులు వచ్చాయన్నారు. మౌని మాట్లాడుతూ జేసీఐ ద్వారా అందించిన పలు సేవా కార్యక్రమాలకు ఈ అవార్డులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ జేసీఐ సెక్రటరీ గంటా అనూష, ట్రెజరర్ కారుమూరి సబిత, సభ్యులు మీనా మణిదీప్తి, దోనెల మౌనిక, సూరిబాబు, కొమ్ముల మురళి, తరుణ్ సాయి, నీలావతి, వేణు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో సమస్యలు దూరం



జగన్నాథపురంలో సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ



పాలకొల్లు వీవర్స్‌కాలనీ సచివాలయం వద్ద పోషకాహార కిట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కాజ తూర్పు గ్రామంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ హసీనా

మొగల్తూరు: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలకు సమస్యలు దూరం అవుతాయని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ అన్నారు. శుక్రవారం జగన్నాథపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పౌష్టికాహార లోపంతో ఎవరూ ఉండకూడదనే ఉద్దేశంతో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కనుమూరి ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్ : గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు అన్నారు. పట్టణంలోని 28, 29 వార్డులకు చెందిన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా పౌష్టికాహార కిట్లను శుక్రవారం అందజేశారు. మాజీ కౌన్సిలర్ చందక ఉమాశైలజ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే పాలు, కోడిగుడ్లు ప్రతీ రోజు ఆహారంగా భుజించడం వల్ల రక్తహీనత సమస్యలు రావన్నారు. 29వ వార్డు ఇన్‌చార్జ్ శీలం సూరిబాబు, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

యలమంచిలి : పుట్టిన బిడ్డకు అరగంట సమయం లోపు తల్లిపాలు పట్టడం వలన బిడ్డ జీవిత కాలంలో అనేక రకాల రోగాల బారిన పడకుండా రక్షించవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ హసీనా చెప్పారు. కాజ తూర్పు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం జరిగిన తల్లిపాల వారోత్సవ సభలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు అమృతంతో సమానమని కనుక ప్రతి ఒక్కరూ తప్పకుండా తల్లిపాలు పట్టించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్స్ కొప్పిసీడి వాణి, పి కుమారి మహిళ పోలీస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తణుకు వెళ్లి పింఛన్ అందజేత



ప్రసాద్‌బాబుకి పింఛన్ అందిస్తున్న వలంటీర్

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన భాస్కర్ల ప్రసాద్‌బాబు గత కొన్ని నెలలుగా పక్షవాతంతో బాధపడుతూ తణుకు పట్టణంలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. అతను ప్రతీ నెలా ఆటో కట్టించుకుని పాలకొల్లు రావాలంటే ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. దీంతో వలంటీరు ఒరిగేటి వరుణ్ రాల్ఫ్ మానవతా దృక్పథంతో ప్రసాద్‌బాబు అనారోగ్య పరిస్థితి గమనించి తణుకు వెళ్లి ప్రసాద్‌బాబుకి పింఛన్ అందిస్తున్నారు. వలంటీర్ వరుణ్‌ను వార్డు ఇన్‌చార్జ్ ధనాల దుర్గమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు ధనాల శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిష్టాత్మకంగా రెండో విడత గడపగడపకు మన ప్రభుత్వం



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రజల అభివృద్ధి, సంక్షేమం నిత్యం తెలుసు కోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం ప్రజలు మెచ్చిన కార్యక్రమం అయ్యిందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నియోజకవర్గంలో చీఫ్‌విప్ ముదునూరి రెండో విడత కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఈ మేరకు శుక్రవారం 16వ వార్డులో ఇంటింటికీ తిరిగారు. ఇప్పటికే మొదటి విడతలో సమస్యలు పరిష్కరించడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వర్షాకలం నేపథ్యంలో కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తేవడంతోపాటు లిఖిత పూర్వక వినతులు కూడా అందించారు. అదే వార్డులో పర్యటిస్తూ అంజుమన్ భవనం రెండవ అంతస్తు నిర్మాణం, గ్రౌండ్ ఫ్లోర్ అభివృద్ధి పనులకు రూ.25 లక్షలతో చేపట్టనున్న పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం రూ. 8లక్షలతో పలు సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రెండు చోట్ల రహదారి నిర్మాణాలకు అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్, మంచినీరు సరఫరా, డ్రెయిన్ తదితర సమస్యలపై మున్సిపల్ సిబ్బంది, అధికారులు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ అంశాలపై సమస్య వలంటీర్ దృష్టికి వస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. 16వ వార్డుకు గడచిన నాలుగేళ్ల కాలంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.13 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే ప్రాదరాజు వివరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ, మార్కెట్‌యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ జయరాజ్‌సింగ్, భూసారపు జయప్రకాష్, యేడిద కోట సత్యనారాయణ (వైకేఎస్), కావలి నాని, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, మల్లాడి బుజ్జి, శేఖర్, బాషాఖాన్, చినమిల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



లంకలకోడేరు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి

పాలకొల్లు అర్బన్: సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. అలాగే ప్రతీ గ్రామంలో ప్రజలకు సరఫరా చేసే మంచినీటిలో క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించడంతో వీధుల్లో ముగ్గు, బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. చికున్ గున్యా, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శానిటేషన్ వర్కర్‌గా పని చేస్తున్న కుమారికి ఏడాదికి రూ.5 వేలు చొప్పున విరాళంగా అందజేయనున్నట్లు ఎంపీపీ కనకలక్ష్మి ప్రకటించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, దగ్గులూరు సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి జోగయ్య, మెడికల్ ఆఫీసర్లు డా.అడ్డాల ప్రతాప్‌కుమార్, డా.భవానిప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

జగనన్న భూహక్కు పథకాన్ని వినియోగించుకోవాలి



శాశ్వత భూ హక్కు కార్డులను అందిస్తున్న ఎంపీపీ సబ్బితి సుమంగళి

పోడూరు: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సబ్బితి సుమంగళి పిలుపునిచ్చారు. పి.పోలవరం గ్రామంలో శుక్రవారం పైలట్ ప్రాజెక్టులో భాగంగా జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఎంపీపీ సుమంగళి, సర్పంచ్ కుచ్చర్లపాటి వెంకట పద్మనాభరాజు చేతులమీదుగా స్థిరాస్తుల యజమానులకు శాశ్వత భూహక్కు కార్డు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీపీ సుమంగళి మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా భూ యజమానులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ భూములతో పాటు నివాస స్థలాలను కూడా సర్వే చేయించి హద్దులు నిర్ణయించి భూ యజమానులకు శాశ్వత భూహక్కు కార్డులు అందిస్తున్నామన్నారు. ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఎంపీడీఓ డి.సుహాసిని పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలు..ఆరోగ్యానికి చిహ్నాలు



యలమంచిలిలో డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ



జుత్తిగలో డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వీరెడ్డి

యలమంచిలి: చెత్త రహిత గ్రామాలు ఆరోగ్యానికి చిహ్నాలని ఎంపీపీ రావూరి వెంకటరమణ అన్నారు. యలమంచిలి గ్రామంలో 1764 కుటుంబాలకు కుటుంబానికి రెండు చప్పున 3528 డస్ట్‌బిన్‌లు సర్పంచ్ బర్రే మేరీతో కలసి శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో వచ్చిన తడి, పొడి చెత్తలను వేర్వేరుగా రెండు డస్ట్‌బిన్‌లో వేసి చెత్త రిక్షా ఇంటికి వచ్చినపుడు వాటిలో వేయాలని ఆమె కోరారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసి చెత్త రహిత గ్రామంగా మండల కేంద్రాన్ని తీర్చిదిద్దాలని ఆమె కోరారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లుల బుజ్జి, పార్టీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, మేడిది పెద్దిరాజు, గవర సురేంద్ర, ఆకుల అంజిబాబు గ్రామ కార్యదర్శి పాలా శారదా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జుత్తిగలో....

పెనుమంట్ర: ప్రతీ ఇంటిలోనూ డస్ట్‌బిన్‌లను ఉపయోగించడం ద్వారా గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని జుత్తిగ సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి గ్రామస్తులను కోరారు. గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆయన ఇంటింటికి ఉచితంగా డస్ట్‌బిన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాండ్రు శాంతా వెంకటేష్, ఉపసర్పంచ్ జి.వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుడిమెట్ల మురళీరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

పూల వ్యాపారికి తోపుడు బండి అందజేత



పూల వ్యాపారం చేసుకునే మహిళకు తోపుడు బండి అందజేస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: రోడ్డుపై పూల వ్యాపారం చేసుకునే మహిళకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ శుక్రవారం తోపుడు బండిని అందించారు. ఈ సందర్భంగా యడ్ల తాతాజీ మాట్లాడుతూ స్థానిక యడ్లబజారు సెంటర్‌కు చెందిన లక్ష్మీ అనే మహిళ కుటుంబ పోషణ నిమిత్తం పూల వ్యాపారం చేసుకుంటుందని తెలిపారు. సరైన తోపుడు బండి లేకపోవడంతో వ్యాపారం చేసుకోవడానికి ఇబ్బందులకు గురవుతుందన్నారు. వ్యాపారం చేసుకోవడానికి తోపుడు బండి ఇప్పించాలని లక్ష్మీ కోరడంతో బండి అందించానన్నారు. పెచ్చెట్టి కృష్ణాజి, చెన్ను విజయ్, సిహెచ్ రమేష్, దిద్దే చిట్టిబాబు, పిల్లా అప్పాజి, కొరగింజల హనుమంతు, పిల్లా శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, జోగి వడ్డికాసులు, దొంగ సతీష్, మండెల బుజ్జి, బెజ్జవరపు నాగరాజు, అంజుత్తి శ్రీను, దేవి కిషోర్, రావి పృథ్వీ, కొండా గణేష్‌లు పాల్గొన్నారు.

వైఎన్నార్ సేవలు ప్రశంసనీయం



పూలపల్లి అంబేడ్కర్ భవన్‌లో యర్రమిల్లి నరసింహరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా, పాలకొల్లు శాఖలో 38 సంవత్సరాలు సేవలందించి హైయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ చేసిన యర్రమిల్లి నరసింహరావు ఉద్యోగులందరికీ ఆదర్శనీయులని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సతీష్ అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పదవీ విరమణ సత్కార సభలో వైఎన్నార్ – లలిత దంపతులను ఎల్‌ఐసీ ఉద్యోగులు, శ్రీ క్షీరారామ, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం, మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రఘుకుమార్ సేవలను కొనియాడారు. అనంతరం గాయత్రి, శ్రీ క్షీరారామ బ్రాహణ సంఘాలు, ఎల్‌ఐసీ ఉద్యోగులు, మిత్ర బృందం ఆధ్వర్యంలో వైఎన్నార్ దంపతులను గజమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘ నాయకులు కోదండరామ్, బెనర్జీ, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు సోమంచి శ్రీనివాస శాస్త్రి, వై ప్రభాకర శాస్త్రి, ముక్కు నరసింహరావు (బాబు), వీరభద్రరావు, నరసింహరావు, కస్తూరి సుబ్బారావు, నండూరి జానకిరామయ్య, నందుల దశరథరామ్ పాల్గొన్నారు.

గొల్లవానితిప్పలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలోని కొత్తకాలనీలో రూ. 17 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఉప సర్పంచ్ బుద్ధాల రామకృష్ణలు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో సమస్యను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లగా వెళ్లగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 17 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ. కోటి 46 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్తే వెంటనే పరిష్కరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గంటా శ్రీనివాసరావు, ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ గుద్దటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కట్టుపాలెం కమిటీ అధ్యక్షుడిగా పొన్నమండ



పొన్నమండ ముత్యాలరావు

యలమంచిలి: వైఎస్సార్ సీపీ కట్టుపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పొన్నమండ ముత్యాలరావు ఎన్నికయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా లంకె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పెచ్చెట్టి రాంబాబు, విప్పర్తి వెంకటేశ్వరరావు (జార్జ్), ఉప కార్యదర్శులుగా పొన్నమండ ధర్మారావు, నక్కవరపు సత్యనారాయణ, ప్రచార కమిటీ సభ్యుడిగా పడాల ఏసు రమేష్, సలహాదారునిగా అప్పారి సుబ్రహ్మణ్యం, ప్రత్యేక సలహాదారుడిగా ఒడుగు హనుమంతరావు సభ్యులుగా కడలి శ్రీనివాసరావు, బుడితి జాన్, లంకె దుర్గారావు, తిరుమాని శ్రీనివాస్, గెద్దాడ తేజోబాబు, కడలి రాము, పూరెళ్ల వెంకట సత్యనారాయణ, పొన్నమండ ఏడుకొండలు, పొన్నమండ నరసింహారావులను ఎన్నుకున్నారు. సమావేశం ముగిసిన తరువాత నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు.

మహావిశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి



మంగళిగుంటలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

పోడూరు: హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల మహా విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ అన్నారు. జగన్నాథపురం గ్రామ శివారు మంగళిగుంట గ్రామంలో శుక్రవారం ఆచంట నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి తొత్తరమూడి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ ఆగష్టు 2వ వారంలో జరిగే మహావిశ్వరూప సభలో ప్రతీ మండలం నుంచి వేలాదిగా మాదిగ సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు కాపా ఇస్సాకు, జిల్లా ఇన్‌చార్జి పలివెల పైడియ్య, జిల్లా కన్వీనర్ కణపాల పెద్దిరాజు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పసుపులేటి చినబాబు, సీనియర్ నాయకులు గంగోలు విజయకుమార్, తొత్తరమూడి వరప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక మార్కెటింగ్ యార్డు ఆవరణలో నియోజకవర్గ సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పసుపులేటి చినబాబు, కొండేటి వరదరాజులు, ముమ్మిడివరపు ఆంజనేయులు, తానేటి బాబూరావు, యార్లగడ్డ రత్నరాజు, ఆకుమర్తి మోషే, పలివెల పైడి, కనసాల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి

సాక్షి, భీమవరం: మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అన్నారు. హింసపై మహిళల పోరుయాత్రలో భాగంగా శుక్రవారం భీమవరం సీఎస్ఎన్ విద్యా సంస్థల్లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె .పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయని హింసను అరికట్టే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాండ్రు స్వరూపరాణి, పి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

కాళ్ల: ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆకివీడు సీఐ కేవీవీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినీ,విద్యార్థులకు పలు సూచనలు చేశారు. యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు.18 ఏళ్ల లోపు కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని బాలికలకు తెలియచేశారు. మహిళలకు రక్షణ కవచంగా ఉన్న చట్టాలు, సైబర్ క్రైమ్, దిశ యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ ఎస్సై ఏజీఎస్ మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.